సాక్షి
హనుమకొండ
శనివారం । 11 । జనవరి । 2025





కమనీయం.. వీరభద్రుడి కల్యాణం

భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్ల కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగా వైభవంగా జరిగింది. తొలుత ఆలయంలో అర్చకులు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సతీమణి మంజుల తీసుకొచ్చిన స్వామివారి పట్టువస్త్రాలను ఆలయ చైర్మన్, ఈఓలు సమర్పించారు. అనంతరం వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలోకి మేళతాళాల నడుమ తీసుకురాగా.. ఆగమ పండితులు, యాగ్నికుల చేతులమీదుగా కల్యాణోత్సవాన్ని రాత్రి కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్త, పాలకవర్గ సభ్యులు, అర్చకులు రాంబాబు, వీరభద్రయ్య, వినయ్‌శర్మ, రాజయ్య, రమేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు. - ఎల్కతుర్తి

న్యూస్‌రీల్

వేయిస్తంభాల ఆలయంలో లక్ష తులసీ దళార్చన



హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీసీతారాముల వారికి లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితుడు మణికంఠశర్మ, అర్చకుడు ప్రణవ్, మేఘనాథాచార్యులు ప్రత్యేక పూజలు, లక్ష తులసీ అర్చన నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన భక్తులు సమర్పించిన వివిధ రకాల పూలతో రుద్రేశ్వరస్వామికి మహాపుష్పార్చన నిర్వహించారు.

కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సరళ



హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలిగా బంక సరళకు మరోసారి అవకాశం కల్పించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు చేతుల మీదుగా బంక సరళ నియామక పత్రం అందుకున్నారు. హనుమకొండ గోకుల్‌నగర్‌కు చెందిన సరళ.. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.

వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా పార్వతమ్మ



వరంగల్: కాంగ్రెస్ వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కర్నాటి పార్వతమ్మను నియమిస్తూ జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు చేతుల మీదుగా నియామకపత్రాన్ని పార్వతమ్మ అందుకున్నారు.

నిట్, ఐఐటీ రోపర్‌తో ఒప్పందం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్, ఐఐటీ రోపర్ సంయుక్తంగా ఆవిష్కరించిన స్టార్టప్ అడిసివ్ ఇంక్ పరిశోధన టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్‌తో వసంత బాలకీ ఫంక్షనల్ మెటీరియల్స్, కెమాటికో టెక్నాలజీస్ కంపెనీ శుక్రవారం అగ్రిమెంట్ చేసుకున్నాయి. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సౌజన్యంతో ఆవిష్కరించిన అడిసివ్ పరిశోధన అభివృద్ధితో పాటు మార్కెట్‌లో సరఫరా చేసేందుకు గాను ఈరెండు కంపెనీలకు అగ్రిమెంట్ చేసుకున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్‌సుబుడీ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ భువనేశ్ కుమార్, ఐఐటీ రోపర్ డైరెక్టర్ రాజీవ్ అహుజ, ఈఅండ్‌ఐటీ గ్రూప్ డైరెక్టర్ సునీతవర్మ, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శిరీశ్‌సోనవానే, ప్రొఫెసర్ రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

కాళోజీ సెంటర్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన బస్ డ్రైవర్లకు జర్మనీలో పనిచేసేందుకు అవకాశం ఉందని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఉమారాణి తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు వివరాలకు 9440051285, 9440048500, 9701040062, 9440051452 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్‌సీటీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యాసాగర్



విద్యారణ్యపురి: రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంఘం (ఆర్‌సీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన డిగ్రీ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ సీహెచ్ విద్యాసాగర్, ఉపాధ్యక్షుడిగా రిటైర్డ్ లైబ్రేరియన్ సత్యనారాయణ రావు ఎన్నికయ్యారు. ఈనెల 9న హైదరాబాద్‌లో ఆంధ్ర మహిళా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆర్‌సీటీఏ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. వరంగల్ జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. వీరిని ఆసంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, కార్యదర్శి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

పండుగ ప్రయాణం



విద్యాసంస్థలకు ప్రభుత్వం శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో స్వగ్రామాలకు వెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ హనుమకొండ, వరంగల్ బస్ స్టేషన్లకు ప్రయాణికులు పోటెత్తారు. ప్రధానంగా హనుమకొండ నుంచి భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం, ఖమ్మం రూట్లలో బస్సులు సరిపోక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. - హన్మకొండ

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

వరంగల్ నగరంలోని కరీమాబాద్‌కు చెందిన పారిజాతం ప్రమాదశాత్తు కిందపడగా కాలికి తీవ్ర గాయమైంది. ఎంజీఎం ఆస్పత్రి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద మూడు నెలల క్రితం ఆపరేషన్ చేయించుకుంది. రివ్యూ ఓపీ కోసం శుక్రవారం ఆ ఆస్పత్రికి వెళ్లగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినట్లు చెప్పడంతో వెనుదిరిగి వెళ్లిపోయింది.

పరకాలకు చెందిన నర్సయ్య కిడ్నీవ్యాధితో బాధపడుతున్నాడు. మందులు అయిపోవడంతో మరోసారి చూయించుకునేందుకు హనుమకొండలోని ఓ కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చాడు. ఆరోగ్యశ్రీ సేవలు లేవని, డబ్బులు పెట్టి చూయించుకోవాలని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిన విషయం తెలియక డబ్బులు కూడా తెచ్చుకోలేదు. దీంతో ఆస్పత్రిలో చూయించుకోకుండానే ఇంటికి వెళ్లిపోయాడు.

... ఇలా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 2 వేల నుంచి3 వేల మంది ఓపీ రోగులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు బంద్

- ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల పరుగులు
- ఉమ్మడి వరంగల్‌లో రూ.90 కోట్లకుపైగా బకాయిలు



ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తున్నట్లు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద కట్టిన బ్యానర్

ఎంజీఎం: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలను పూర్తి స్థాయిలో నిలిపేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంగా బిల్లులు చెల్లించకపోవడంతో సేవలను బహిష్కరించినట్లు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50 నెట్‌వర్క్ ఆస్పత్రులుండగా.. రూ.90 కోట్ల బకాయిలున్నాయి. కేవలం గ్రేటర్ వరంగల్ పరిధిలోనే 35 నుంచి 40 ఆస్పత్రులు కొనసాగుతున్నాయి. ఇందులో 20 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉండగా.. మిగతా 30 ఆస్పత్రులు, ఒక్కటి, రెండు స్పెషాలిటీ సేవలతో కొనసాగుతున్నాయి. 50 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నిత్యం సుమారు 3,500 మంది ఓపీ విభాగం ద్వారా చికిత్సలు పొందుతుండగా.. సుమారు 50 నుంచి 100 వరకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తుంటారు. శుక్రవారం నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు ఓపీ, సేవలతో పాటు శస్త్ర చికిత్సలను ఆరోగ్య శ్రీ ద్వారా నిలిపేయడంతో గత్యంతరం లేక ఎంజీఎం ఆస్పత్రితో పాటు, హైదరాబాద్ ఉస్మానియా, గాంధీ, నిమ్స్ వంటి ఆస్పత్రులకు పరుగులు తీశారు.

ప్యాకేజీల పెంపు అస్తవ్యస్తం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.5 లక్షల ప్యాకేజీని రూ.10 లక్షలకు పెంచినట్లు ప్రకటించారు. కాగా.. ఈ ప్యాకేజీలో అన్ని విభాగాల శస్త్రచికిత్సలకు పెంచకుండా కొన్ని రకాల శస్త్రచికిత్సలకు మాత్రమే పెంచి నెట్‌వర్క్ ఆస్పత్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆస్పత్రుల ప్రతినిధులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌లో కొనసాగుతున్న కార్పొరేట్ ఆస్పత్రులకు ఓ రకమైన ప్యాకేజీలు, తెలంగాణ జిల్లాలోని ఆస్పత్రులకు మరో రకమైన ప్యాకేజీలు అందిస్తూ వివక్షకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో శస్త్రచికిత్సకు కేటాయించిన క్లయిమ్ డబ్బుల్లో రూ.500 నుంచి 700 వరకు ఎలాంటి కారణం చెప్పకుండా కోత విధిస్తూ వాటిని ఆరోగ్య శ్రీ ప్రతినిధులు ఎలా ఖర్చు చేస్తున్నారో.. ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఫలించని చర్చలు

ఆరోగ్య శ్రీ బకాయిలపై గురువారం ప్రభుత్వ ప్రతినిధులతో జరిగిన చర్చలు ఫలించని నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు పేర్కొన్నారు. ఐదుశాతం బడ్జెట్ విడుదల చేసి సేవలను కొనసాగించాలని పేర్కొన్నారని తెలిపారు. ఈవిషయంపై ఆలోచిస్తామని చెప్పాం.. తప్ప సేవలు కొనసాగిస్తామని ప్రకటించలేదని ఆరోగ్యశ్రీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

ఎలాంటి ఫిర్యాదులు అందలేదు..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఎమర్జెన్సీ కేసులను హైదరాబాద్‌కు తరలిస్తున్నాం.
– విక్రమ్, ఆరోగ్యశ్రీ ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్

భూ సేకరణకు రైతులు సహకరించాలి

- ఆర్డీఓ రమేశ్ రాథోడ్
- ఎర్రబెల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమేశ్ రాథోడ్

వేలేరు: గౌరవెల్లి ప్రాజెక్ట్ నుంచి ఎర్రబెల్లి గ్రామానికి వచ్చే కెనాల్ కోసం భూసేకరణ చేసేందుకు రైతులు సహకరించాలని ఆర్డీఓ రమేశ్ రాథోడ్ కోరారు. శుక్రవారం మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో కెనాల్‌కు భూములు కోల్పోతున్న రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెనాల్ కోసం 19.5 ఎకరాల భూమి అవసరం ఉందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని తెలిపారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రికార్డుల్లో ఒకరు, కాస్తులో మరొకరు ఉన్నారని అసలైన రైతులకే న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. పంట భూముల్లో బోర్లు, బావులు ఉన్నాయని వాటితోనే తమకు జీవనాధారమని, అవకాశం ఉంటే కాల్వ డిజైన్ మార్చాలని కోరారు. స్పందించిన ఆర్డీఓ డిజైన్ మార్చాలని రాత పూర్వకంగా దరఖాస్తు ఇస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం ఎవరి భూమి ఎంత సేకరిస్తున్నారో రైతులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్.కోమి, నీటి పారుదల శాఖ డీఈ చైతన్య, ఆర్ఐ సురేందర్, సర్వేయర్ కవిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల్ని వినియోగించుకోవాలి

జిల్లా టీబీ కో–ఆర్డినేటర్ డాక్టర్ హిమబిందు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ హిమబిందు

కమలాపూర్: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా టీబీ కో–ఆర్డినేటర్ డాక్టర్ హిమబిందు సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో సంపూర్ణ సురక్ష కేంద్రం, టీబీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని శనిగరంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా 160 మందికి రక్త పరీక్షలు, హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్, హెపటైటిస్–బీ, బీపీ, షుగర్, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సంపూర్ణ సురక్ష కేంద్రం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈశిబిరంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్, టీబీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ అఖిల్, రావర్తి సురేశ్, గోవర్ధన్, చంద్రమౌళి, టీబీ కో–ఆర్డినేటర్లు సుధాకర్, కిరణ్, నాగేశ్, విజయ్‌మోహన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఓరుగల్లు అభ్యర్థి

పులి సరోత్తంరెడ్డిని ప్రకటించిన బీజేపీ

- 2019లో ఉపాధ్యాయ వృత్తికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ
- పీఆర్టీయూలో కీలక భూమిక.. ఆ తర్వాత బీజేపీలో చేరిక



హన్మకొండ: నల్లగొండ–వరంగల్– ఖమ్మం ఉపాధ్యాయ నియోజవర్గ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధికారికంగా ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం మందలూరిపల్లె గ్రామానికి చెందిన సరోత్తంరెడ్డి ప్రస్తుతం ఎస్‌బీహెచ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. 1984లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన సరోత్తంరెడ్డి, 2019 ఫిబ్రవరిలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్నారు. అదే సంవత్సరం మార్చిలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి 11శాతం ఓట్లు పొందారు. పీఆర్టీయూలో కీలక భూమిక పోషించిన సరోత్తంరెడ్డి 2004 నుంచి 2012 వరకు పూర్వ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2012 నుంచి 2019 వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. తర్వాత బీజేపీలో చేరారు. ప్రస్తుతం బీజేపీ రిటైర్డ్ టీచర్స్, ఎంప్లాయీస్ సెల్ రాష్ట్ర కో చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తెలంగాణ ఉద్యమంలోను చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ టీచర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులతో సత్సంబంధాలు ఉన్న ఆయనను నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ప్రకటించింది. తనకు అవకాశం కల్పించిన పార్టీ అధిష్టానానికి సరోత్తంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

జనజీవన స్రవంతిలో కలవండి

డీసీపీ షేక్ సలీమా



చంద్రమ్మకు చీర అందజేస్తున్న డీసీపీ సలీమా

హసన్‌పర్తి: అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలవాలని సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పిలుపునిచ్చారు. 'పోరు కన్నా–ఊరు మిన్న' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన మావోయిస్ట్ మందా రూబెన్ అలియాస్ మంగన్న తల్లి చంద్రమ్మను డీసీపీ సలీమా పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలు ఎదురైతే మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పంపిన చీర, దుప్పట్లను రూబెన్ తల్లి చంద్రమ్మకు అందించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ మావోయిస్టులు అజ్ఞాతం వీడి వస్తే రివార్డులతో పాటు ప్రభుత్వపరంగా అన్ని రకాల ప్రయోజనాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ తిరుమల్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ పార్థసారథి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూకు 5 రోజులు సెలవులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి వరుసగా శనివారం నుంచి బుధవారం వరకు(ఐదు రోజులు) సెలవులు ప్రకటిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి సర్క్యులర్ జారీ చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కనుమను పురస్కరించుకుని ఈనెల 15న కూడా సెలవు దినంగా ప్రకటిస్తూ.. శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి సర్క్యులర్ జారీ చేశారు. ఆసెలవుకు బదులుగా ఈఏడాది మార్చి 8న రెండో శనివారం పనిదినంగా ప్రకటిస్తూ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. క్యాంపస్‌లోని వివిధ విభాగాలతోపాటు యూనివర్సిటీ కాలేజీలకు, విశ్వవిద్యాలయాల కార్యాలయాలకు ఈనెల 15న సెలవు వర్తించనుంది.

బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

హన్మకొండ: హనుమకొండ జిల్లాలోని మండలాల అధ్యక్ష, కార్యదర్శులను బీజేపీ అధిష్టానం శుక్రవారం నియమించింది. వీరితో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులను ప్రకటించింది. బీజేపీ సంస్థాగత, రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి అధ్యక్షులు, కార్యదర్శులను ప్రకటించారు. ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి కార్యదర్శిగా గట్టు వేణు, నడికూడ అధ్యక్షుడిగా ఎరుకల దివాకర్, కార్యదర్శిగా గోగుల రాజిరెడ్డి, పరకాల రూరల్ అధ్యక్ష కార్యదర్శులుగా కాసగాని రాజ్‌కుమార్, ఎం.బాబు యాదవ్, పరకాల టౌన్ అధ్యక్షుడిగా గాజుల నిరంజన్, కార్యదర్శిగా మార్త రాజభద్రయ్యను నియమించారు.

12 నుంచి ఐలోని మల్లన్న జాతర



గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మలతో మల్లికార్జునుడు

ఐనవోలు: వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఐనవోలు(ఐలోని) శ్రీమల్లికార్జున స్వామి జాతర ఈనెల 12వ తేదీన ప్రారంభం కానుంది. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే ఈ జాతరలో ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ అధికారులతోపాటు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జానపదుల జాతరగా కీర్తినొందుతున్న ఐనవోలు మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఆదివారం విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. అయితే ప్రతి బుధ, ఆది వారాలలో భక్తులు ఎక్కువగా హాజరయ్యే ఈ ఉత్సవాలు సుమారు మూడు నెలలపాటు కొనసాగనున్నాయి.

ఏర్పాట్ల పరిశీలన



ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర ఏర్పాట్లను దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్(ఆర్‌జేసీ) రామకృష్ణారావు పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఆయన మల్లన్నను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ సిబ్బందితో కలిసి ఆలయ ప్రాంగణం అంతా కలియదిరిగారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఈఓను ఆదేశించారు.

జాతర షెడ్యూల్

- జనవరి 12న ఉత్సవాలు ప్రారంభం స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలంకరణ
- 13న భోగి పండుగ, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం
- 14న మకర సంక్రాంతి పండుగ, ప్రత్యేక పూజలు, 'రాత్రి ప్రభల' బండ్ల తిరుగుట
- 16న మహాసంప్రోక్షణ సమారాధన
- ఫిబ్రవరి 3 వసంత పంచమి, శ్రీభ్రమరాంబిక అమ్మవారి ఏకాదశ వార్షికోత్సవం
- ఫిబ్రవరి 12న ఎల్లమ్మ దేవత పండుగ
- ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు
- 24న శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం. ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ
- 25న ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి శేషవాహనసేవ, బలిహరణ
- 26న మహాశివరాత్రి 'శివకల్యాణం' పెద్దపట్నం, ఉదయం సింహ వాహనసేవ, రాత్రి నంది వాహనసేవ
- 27న రావణ వాహనసేవ, రాత్రి రథోత్సవం, పురవీధి సేవ
- 28న పర్వత వాహనసేవ, రుద్రహోమం, చండీ హోమం, బ్రహ్మోత్సవాల ముగింపు, రాత్రి పవళింపుసేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ
- మార్చి 23న గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మలతో మల్లికార్జునస్వామి కల్యాణం, పెద్దపట్నం, ఊరేగింపు
- 30న 'ఉగాది' బిల్వార్చన, సాయంత్రం పంచాంగ శ్రవణం



గిరిజనులు ఉపయోగించిన పురాతన పనిముట్లు



గిరిజన వాయిద్యాలు



పూర్వకాలం నాటి సామగ్రి

విజ్ఞాన పీఠం@30

నేటితో మూడు దశాబ్దాలు పూర్తి | **పరిశోధనాలయంగా గుర్తింపు**

- అరుదైన జానపద కళారూపాల సేకరణ
- ఈఏడాది నుంచి ఎం.ఏ హిస్టరీ అండ్ టూరిజం కోర్సు



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం భవనం

హన్మకొండ కల్చరల్ : ఓరుగల్లు నగరం చారిత్రక ఆనవాళ్లకు నిలయం. కాకతీయుల కాలం నుంచి నేటికి అనేక కట్టడాల తోపాటు విద్యాభివృద్ధిలో ప్రత్యేక స్థానం ఓరుగల్లుది. ఇంతటి ప్రత్యేకత కలిగిన వరంగల్ నగరం నడిబొడ్డున భద్రకాళీ దేవస్థానం.. విశాలమైన చెరువు.. ఆ పక్కనే భద్రకాళీ ట్యాంక్‌బండ్ ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో కొలువై ఉంది.. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం. ఓరుగల్లు సిగలో అద్భుత పరిశోధనాలయంగా వెలుగొందుతోన్న ఈ జానపద గిరిజన విజ్ఞాన పీఠం ఏర్పాటై 30ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

జానపద, గిరిజన పీఠం

1995లో తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య పేర్వారం జగన్నాథం, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు, కాళోజీ రామేశ్వరరావు, అంపశయ్య నవీన్ వంటి జిల్లా ప్రముఖుల ఆకాంక్షతో ఈ పీఠం ఏర్పాటైంది. 1999లో అప్పటి కలెక్టర్ శాలినీమిశ్రా హంటర్‌రోడ్‌లో 3.7ఎకరాల స్థలం కేటాయించగా.. నాడు ఎంపీగా ఉన్న ఆచార్య సి.నారాయణరెడ్డి అందించిన రూ.30లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో 2000 సంవత్సరంలో సొంతభవన నిర్మాణం జరిగింది. ఆతర్వాత నాయకులు పట్టించుకోకపోవడంతో ఈ పీఠానికి నేటికీ కనీసం ప్రహరీ లేకపోవడం గమనార్హం. తెలంగాణ సంస్కృతికి పెద్దపీట వేస్తున్న ఈ పీఠాన్ని రక్షించుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విద్యావేత్తలు ఆకాంక్షిస్తున్నారు.

పరిశోధనలు..

ఈ విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో నేటికీ అనేక పరిశోధనలు కొనసాగుతోన్నాయి. పీఠానికి చెందిన పరిశోధనా బృందాలు గ్రామాలకు వెళ్లి అక్కడి జీవన విధానం. వారు కాపాడుతున్న విజ్ఞానాన్ని సేకరించి భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నారు. అయితే జానపద, గిరిజన జాతుల సంస్కృతి, జీవనవిధానంపై పరిశోధనలు కొనసాగిస్తూనే 1998లో పీహెచ్‌డీ, ఎం.ఫిల్ కోర్సులు ప్రారంభమయ్యాయి. 2024–25 సంవత్సరానికి ఎం.ఏ తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రవేశపెట్టారు.

జానపద, గిరిజన విజ్ఞానంపై పుస్తకాలు

పూర్వ పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఇప్పటివరకు జానపద విజ్ఞాన సమాలోచన, నల్గొండ–రాష్ట్రస్థాయి జానపద కళోత్సవాలు ప్రత్యేక సంచిక, జానపద కిరణం త్రైమాసిక పత్రిక, మన పల్లెటూళ్ల పాటలు–అమ్మాపురం, కొర్రాజుల కథలు, జానపద విజ్ఞానదర్శిని చొల్లపల్లి, జానపదవిజ్ఞాన దర్శిని విస్సూరు, వల్మిడి, ద్రౌపది తిరుణాళ్ల (ధర్మరాజు తిరునాళ్ల, తూర్పుగోదావరి జిల్లా జానపద ఆటలు, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, కొండరెడ్డి గిరిజనుల జీవనవిధానం, బొడ్లంక పాటలు, పగటివేష కళాకారులు సాంస్కృతిక జీవనం (పార్వతీనగర్), మల్లన్నజాతర –ఐనవోలు, బంజారాల తీజ్‌పండుగ, సమ్మక్క సారలమ్మ జాతర, ఖోండ్, కమ్మరి, భగత, వాల్మీకి, కొండదొర, మాలి, నూకదోర తదితర విశాఖపట్నం గిరిజనుల తెగలపై పుస్తకాలు, కోయ, కొండరెడ్డి ఖమ్మం గిరిజన తెగల జీవనస్థితిగతులపై పుస్తకాలు ప్రచురించారు. జానపద గిరిజన పీఠం ఆధ్వర్యంలో ఇప్పటివరకు 18 జాతీయ సదస్సులు జరిగాయి. సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాలతో 'జానపద గిరిజన విజ్ఞానం– జాతీయ సదస్సుల పత్రాలు' పేరుతో పుస్తకం ప్రచురించారు.



పీఠంలోని గ్రంథాలయం

కళారూపాలపై శోధన

కళాప్రదర్శననే తమ వృత్తిగా స్వీకరించి జీవనం సాగిస్తున్న కళాకారులు వందల సంఖ్యలో ఉన్నారు. వీరిలో చిందు యక్షగానం, డక్కలి, గౌడశెట్టి, ఏనుటి, మందహెచ్చు, కాకిపడిగెల, మాసయ్య, గంజికూటి, కూజరి, డోలి, పట్టిడ, బాట్స్, దాడి, బైండ్ల, దూబ్బుల, బుడబుక్కల, ఒగ్గు, పంబాల, మొండి, గంగిరెద్దు, బాలసంతు, జంగాలు, శారద, డప్పు, పాములాట, చెక్కబొమ్మలాట, తోలుబొమ్మలాట, ఎరుకసోదే, పిట్టలదోర, లంబాడ నృత్యం, కోయనృత్యం, కోర్రాజులు, కూనపులి, ఆద్దెపుసింగు, కాటిపాపల, హరిదాసులు, కడ్డీతంత్రి, కోలాటం, చెక్కభజన, మాలభోగం, కిన్నెర, చిలుకపంచాంగం వంటి ఎందరో కళాకారులు కళనే వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు. వీటిలో ఎన్నో కళారూపాలు అంతరించిపోయే స్థాయిలో ఉన్నాయి. వీటిలో కొన్ని పరిశోధనలు చేసి ఉన్నాయి. వారిజీవన విధానాన్ని పొందుపర్చి పుస్తకాల రూపంలో వెలువరించాల్సిన అవసరం ఉంది.

భవిష్యత్ తరాలకు వారధి



సమాజంలో ఒక్కో కులానికి ఒక్కో కళారూపం ఉండటం విశేషం. ఈ కళారూపాలు అంతరించిపోయే స్థితిలో ఉన్నాయి. ఆ కళారూపాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే విజ్ఞాన పీఠం చేసే మహత్కార్యం. భవిష్యత్ తరాలకు వారధిగా ఈ పీఠం పనిచేస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తే మరిన్ని పరిశోధనలతోపాటు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించొచ్చు. ఈ విద్యాసంవత్సరం ఎం.ఏ హిస్టరీ అండ్ టూరిజం కల్చర్ కోర్సును ప్రవేశపెడుతున్నాం.

– ప్రొఫెసర్ భూక్య బాబురావు, పీఠాధిపతి

జానపద వస్తువులతో మ్యూజియం

భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో సేకరించిన సమాచారాన్ని పీఠంలో ఏర్పాటు చేసిన అభిలేఖన భాండాగారంలో నిక్షిప్తం చేశారు. సుమారు 10వేల ఛాయచిత్రాలు, 9వేల పేజీల శుద్ధ రాత ప్రతులు నిక్షిప్తం చేశారు. అరుదైన జానపద వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేశారు. పీఠంలో పరిశోధకులకు అవసరమైన అనేక గ్రంథాలు, అరుదైన సంపుటాలు ఉన్నాయి. గిరిజన తెగలపై పరిశోధిస్తున్న ఎందరో ఈ గ్రంథాలయాన్ని సందర్శిస్తుంటారు. జానపద గిరిజన విజ్ఞాన పీఠం స్ఫూర్తితోనే పలువిశ్వవిద్యాలయాల్లో కళారూపాలు, గిరిజన సంస్కృతులపై పరిశోధనలు జరుగుతుండటం విశేషం. అయితే.. 2023లో కురిసిన అధిక వర్షాలు, వరదల కారణంగా పీఠం గ్రౌండ్ ఫ్లోర్‌లోని మ్యూజియంలోని సగంపైగా వస్తువులు, గ్రంథాలయంలోని వేలాది పుస్తకాలు నీటిలో మునిగిపోవడంతో పాడైపోవడం బాధాకరం.

జూ పార్క్‌లో పులుల గర్జన

- నేడు ఎన్‌క్లోజర్స్ ప్రారంభించనున్న మంత్రి సురేఖ

సాక్షి ఎఫెక్ట్..

న్యూశాయంపేట: నెల రోజులుగా పర్యాటకులు ఎదురుచూస్తున్న అడవి జంతువుల (పులులు, జింకలు, అడవి దున్నలు) గర్జన శనివారం నుంచి సందర్శకులకు వినిపించనుంది. ఎంటర్ ది ఎన్‌క్లోజర్స్ ఎప్పుడో ..? అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఎన్‌క్లోజర్స్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నేడు(శనివారం) ఎన్‌క్లోజర్స్ ప్రారంభించనున్నారు. వరంగల్ జూ పార్క్‌కు కొత్త కళ తీసుకురావడానికి అడవి జంతువుల సంఖ్య పెంచాలనే మంత్రి ఆదేశాలతో హైదరాబాద్ నెహ్రూ జువాలజికల్ పార్క్ నుంచి బెంగాల్ టైగర్స్ (శంకర్, కరీనా), బైసన్స్ (అడవి దున్నలు), విశాఖపట్నం నుంచి బార్కిన్‌సన్ డీర్స్(జింకలు) తీసుకొచ్చారు. నెల రోజులుగా బోన్లలో బందీలుగా ఉన్న ఈ జంతువులు 'సాక్షి' కథనంతో పర్యాటకులను సందడి చేయడానికి రానున్నాయి.

అలజడి చేయనున్న అడవి జంతువులు

కొన్నేళ్లుగా చెప్పుకోదగ్గ వన్యప్రాణులు లేక వెలవెలబోయిన ఓరుగల్లు జూ పార్క్‌కు ప్రస్తుతం కొత్తగా వచ్చిన బెంగాల్ టైగర్స్, బైసన్(అడవి దున్నలు), హగ్‌డీర్, బార్కిన్‌సన్ డీర్స్(జింకలు) సందడి చేయనున్నాయి. హైదరాబాద్ జూపార్క్ తర్వాత రాష్ట్రంలోనే రెండోదైన వరంగల్ కాకతీయ జూపార్క్ అభివృద్ధికి జిల్లా మంత్రి సురేఖ ప్రత్యేక చొరవ చూపడంతో మరిన్ని జంతువులు ఇక్కడకు వస్తున్నాయి.

హోరాహోరీగా ఖోఖో పోటీలు

- నేటితో ముగియనున్న టోర్నమెంట్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బాలకిశోర్‌రెడ్డి, తదితరులు

గీసుకొండ : గీసుకొండలో ఖోఖో సీనియర్స్ 57వ అంతర్ జిల్లాల క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో పురుషులు, మహిళ, పోలీసు జట్లు ఇలా 21 టీంలు పాల్గొంటున్నాయి. పోటీలు గురువారం ప్రారంభం కాగా శనివారంతో ముగుస్తాయని టోర్నమెంట్ ఆర్గనైజర్ వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. టోర్నమెంట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి శుక్రవారం పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిలో ఉత్తేజం నింపారు. డే అండ్ నైట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. తహసీల్దార్ రియాజుద్దీన్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోట రాంబాబు, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్, మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి పాల్గొన్నారు.

శుక్రవారం పోటీలు ఇలా..

పురుషుల విభాగంలో..

హైదరాబాద్ జట్టు ఖమ్మం–బీ జట్టును, రంగారెడ్డి జట్టు టీఎస్ పోలీస్–బీ జట్లును, ఆదిలాబాద్ జట్టు కరీంనగర్–ఏ ను, మెదక్ జట్టు నల్గొండ–ఏ ను, హైదరాబాద్ జట్టు టీఎస్ పోలీస్–బీ ని, రంగారెడ్డి జట్టు మహబూబ్‌నగర్–బీ ని, ఖమ్మం జట్టు నిజామాబాద్–బి ని, కరీంనగర్ జట్టు మెదక్–ఏ ను, రంగారెడ్డి జట్టు ఖమ్మం–బి ని, వరంగల్ జట్టు ఆదిలాబాద్–ఏ ను, టీఎస్ పోలీస్ జట్టు నిజామాబాద్–బీ ని, హైదరాబాద్ జట్టు మహబూబ్‌నగర్–బి జట్టును ఓడించాయి.

మహిళల జట్లు..

మహబూబ్‌నగర్ జట్టు ఆదిలాబాద్–బి జట్టును, హైదరాబాద్ జట్టు కరీంనగర్–ఏ జట్టును, రంగారెడ్డి జట్టు మెదక్–బీ ని, నల్గొండ జట్టు వరంగల్– ఏ జట్టును, ఆదిలాబాద్ జట్టు నిజామాబాద్–బీ ని, నల్గొండ జట్టు కరీంనగర్–ఏ ను, రంగారెడ్డి జట్టు ఆదిలాబాద్–బీ ని, హైదరాబాద్ జట్టు వరంగల్–ఏ ను, మహబూబ్‌నగర్ జట్టు మెదక్ –బీ ని, ఖమ్మం జట్టు కరీంనగర్–ఏ ను ఓడించాయి.

కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగుడికి కృత్రిమ కాలు అమర్చుతున్న వైద్యులు

హన్మకొండ కల్చరల్: హనుమకొండకు చెందిన ఎన్నారై, వెంటోయిస్ సీఈఓ సుమన్‌రెడ్డి కోట, వరంగల్‌కు చెందిన ఎన్నారై టీటీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దివాకర్ జంధ్యం సహకారంతో 110 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లను పంపిణీ చేశారు. శుక్రవారం హనుమకొండలోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృత్రిమ కాళ్ల పంపిణీతోపాటు, దంత వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దంతవైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్యులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి దివ్యాంగులకు సూచనలిచ్చారు. ఎన్నారైలతోపాటు ఖమ్మం రోటరీ క్లబ్‌కు చెందిన రంగారావు, తెలంగాణ అమెరికా తెలుగు అసోసియేషన్ సహకారంతో విజయవంతంగా కృత్రిమ అవయవాల పంపిణీ నిర్వహించారు. ప్రశాంతిరెడ్డి, జంధ్యం మధుకర్, జంధ్యం కరుణాకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన



ఎస్సారెస్పీ భూములను పరిశీలిస్తున్న అధికారులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ చల్లా ప్రసాద్, నీటి పారుదలశాఖ డీఈఈ రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలించారు. ఈమేరకు చింతగగట్టు సమీపంలోని ఎస్సారెస్పీ భూమి ప్లాంటుకు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. నగరంలోని 65వ డివిజన్‌లో ఎస్సారెస్పీ కాల్వ కోసం సేకరించిన భూముల్లో సుమారు ఏడెకరాల భూమి ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు స్థలం అనుకూలంగా ఉంటున్నట్లు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. కాగా.. జిల్లావ్యాప్తంగా ప్రతీ మండలంలోనూ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు ఆయా మండలాల్లో సుమారు ఐదెకరాల నుంచి పదిహేను ఎకరాల మేరకు స్థలాన్ని సేకరించనున్నారు. ఇందులో ప్రభుత్వ స్థలాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సర్కారు స్థలాలు అందుబాటులో లేని పక్షంలో ఎస్సారెస్పీ భూముల్లో ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి జిల్లా యంత్రాంగం వచ్చినట్లు తెలిసింది.

మహిళా సంఘాలకు బాధ్యతలు..

సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణ బాధ్యతలు మహిళా స్వయం సహాయ సంఘాలకు అప్పగించనున్నారు. ప్లాంట్ల నిర్మాణం కోసం బ్యాంకుల నుంచి రుణం కూడా ఇప్పించడానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోనున్నారు.

సీఎం సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్య శారద



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సత్య శారద

వరంగల్: హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, లబ్ధిదారుల జాబితాల తయారీపై సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. నాలుగు పథకాల అమలుపై రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు వెంటనే సన్నాహాలు చేసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఐటీ నిబంధనలపై అవగాహన కల్పించాలి

వరంగల్: ఆదాయపన్ను నిబంధనలు, మినహాయింపులు, తగ్గింపులపై పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించే బాధ్యత డీడీఓలపై ఉంటుందని వరంగల్ జిల్లా ఆదాయపన్ను అధికారి మహేందర్‌బాబు అన్నారు. ఆదాయపన్నుల ప్రిన్సిపల్ కమిషనర్ శివరాజ్‌మోరే ఆదేశాల మేరకు బీఎస్‌ఎన్‌ఎల్ భవనంలోని కార్యాలయంలో ఇన్‌కంటాక్స్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సరైన ఆదాయపన్ను వివరాలతో ఇన్‌కంటాక్స్ ఈ–ఫైలింగ్ పోర్టల్‌లో రిటర్నులను జూలై 31లోగా ప్రతిఏడాది ఫైల్ చేయాలన్నారు. బోగస్ మినహాయింపులు, తగ్గింపులు క్లైం చేస్తే ఫెనాల్టీలు వేయడమే కాకుండా ప్రాసిక్యూషన్ ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

వరంగల్‌లో స్పోర్ట్స్ విలేజ్

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- జేఎన్‌ఎస్‌లో 34వ సీనియర్ నేషనల్స్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్
- 28 రాష్ట్రాలు– 600 మంది క్రీడాకారులు
- ఈ నెల 14 వరకు కొనసాగనున్న పోటీలు



మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



పోటీలో తలపడుతున్న తెలంగాణ– మణిపూర్ జట్లు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ నగరంలో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలంతా కలసి స్థల సేకరణకు అన్వేషిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 34వ సీనియర్ నేషనల్స్ సెపక్‌తక్రా మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అనంతరం బాణసంచా కాల్చి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వరంగల్ మామునూరు, జక్కలొద్ది ప్రాంతాల్లో 100 ఎకరాల్లో స్పోర్ట్స్ విలేజ్ ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి శేఖర్ మాట్లాడుతూ.. 28 రాష్ట్రాల నుంచి పురుషుల జట్లు, 22 రాష్ట్రాల మహిళల జట్లు, 30 మంది టెక్నికల్ అఫిషియల్స్ హాజరయ్యారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జపాన్‌లో జరుగనున్న ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల బీజేపీ అధ్యక్షులు రావు పద్మ, చందుపట్ల కీర్తిరెడ్డి, డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేశ్‌రెడ్డి, తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ చైర్మన్ లయన్ హనుమాండ్లరెడ్డి, ప్రేమ్‌రాజ్, వికేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, జగన్నాథస్వామి, శ్రీధర్, సంజీవరెడ్డి, అనిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఆట..

మొదటి రోజు జరిగిన మ్యాచ్‌ల్లో ఎస్‌ఎస్‌బీ టీం ఆడిన ప్రతి మ్యాచ్‌లో విజయం సాధించింది. అందుకు భిన్నంగా తెలంగాణ జట్టు ఆడిన ప్రతీ మ్యాచ్‌ను ఓటమి చవిచూసింది. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో సాగిన మ్యాచ్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడా గెలవకపోవడం తెలంగాణ క్రీడాకారులను నిరుత్సాహపరిచింది.